క్లుప్తంగా

బోరు బాగుజేయరూ..



తలుపులమ్మ కాలనీలో మరమ్మతుకు గురైన బోర్‌వెల్

పెద్దాపురం: పట్టణంలోని 22వ వార్డు తలుపులమ్మ కాలనీలో మంచినీటి బోరు మరమ్మతులకు గురైంది. కాలనీవాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. పాడై వారం రోజులు అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువగా బోర్‌నీరుకు అలవాటు పడడంతో గుక్కెడు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని, లేని పక్షంలో ప్రజల తరుపున ఉద్యమిస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ అన్నారు.

'ముద్రగడ' పరామర్శ



కొత్తెం శ్రీరామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గిరిబాబు తదిరులు

పెద్దాపురం: దివిలి మాజీ సర్పంచ్ కొత్తెం వెంకట శ్రీనివాసరావు, కొత్తెం బాలకృష్ణల కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శనివారం పరామర్శించారు. శ్రీనివాసరావు, బాలకృష్ణల తండ్రి శ్రీరామ్మూర్తి మృతిపై ఆయన సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గ్రామంలో సీనియర్ రాజకీయ వేత్తగా శ్రీరామ్మూర్తి చేసిన సేవలను కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట తోట నవీన్, పెంటకోట నాగబాబు తదితరులున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు విన్నకోట సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జయలక్ష్మి థియేటర్ రోడ్డులో ఉదయం 6 గంటల నుంచి వైద్య శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. ఈ శిబిరంలో బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి మందులు, సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. శిబిరానికి వచ్చేవారు ఎటువంటి ఆహారం తీసుకోకుండా రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు విన్నకోట సురేష్, 98664 11346 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తపల్లి: వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో విశాఖపట్నం అపోలో క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం క్యాన్సర్, తలసేమియా స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం ప్రారంభమైన ఈ శిబిరం సాయంత్రం వరకూ కొనసాగింది. కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, ఉప్పాడ తదితర గ్రామాల నుంచి వచ్చిన సుమారు 200 మంది పరీక్షలు చేయించుకున్నారు. ఆదివారం కూడా ఈ వైద్య శిబిరం కొనసాగనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల శ్రీనివాస్, రావు చిన్నారావు, ఆనాల సుదర్శన్, చెట్టుబత్తిన సురేష్ కుమార్, రావు అక్షయ్, సానా నాగు, అపోలో ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కాకినాడలో సంగీత విభావరి

బోట్‌క్లబ్: ప్రముఖ న్యాయవాది మాదిరెడ్డి సుబ్బారావు జయంతి సందర్భంగా సోమవారం సాయంత్రం 6 గంటలకు స్థానిక ఐటీఐ పక్కన ఉన్న గ్రౌండ్‌లో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ గాయని కల్పన, రాము, పీవీ రమణ ఆధ్వర్యంలో ఈ సంగీత విభావరి జరుగుతుందన్నారు. కళాభిమానులు అందరూ పాల్గొనాలని కోరారు.

నేడు దశావతారం కథామాలిక

బోట్‌క్లబ్: హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక మధురానగర్ గోకులంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు దశావతారం కథామాలిక నిర్వహిస్తున్నట్టు గోకులం అధ్యక్షులు నారాయణం మురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత హరినామ సంకీర్తన, అనంతరం దశావతార మహిమపై ప్రవచనం ఉంటుందన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

కరప: వేములవాడ గ్రామ శివారు సిరిగలపల్లి లంక గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేలపై శనివారం దాడి చేసి 12 మందిని కరప పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.21,200 నగదు, నాలుగు కోడిపుంజులు, నాలుగు కోడి కత్తులు సీజు చేశారు. వారిపై కరప ఎస్సై టి.సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నారు.

ఈ-సేవలకు స్వస్తి!

- ఆర్‌బీకేల్లో మూలకు చేరిన కియోస్క్‌లు
- గతంలో రైతులకు మెరుగైన సేవలు
- పట్టించుకోని కూటమి నాయకులు



ఆర్‌బీకేల్లో కియోస్క్‌ను ప్రారంభిస్తున్న కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు (ఫైల్)



ప్రస్తుతం ఆర్‌బీకేల్లో వినియోగంలో లేకుండా మూలకు చేరిన కియోస్క్

పెద్దాపురం: విత్తనం నాటే దగ్గర నుంచి పంట విక్రయం వరకు అన్నదాతకు అండగా ఉండాలనే ఆశయంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలను (ఇప్పుడు రైతు సేవా కేంద్రాలు) ఏర్పాటు చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు ఏవి అవసరమైన రైతులు ఆర్‌బీకే వద్దకు వచ్చి తీసుకువెళ్లేవారు. అక్కడి సిబ్బందికి ముందుగు నగదు చెల్లించి వారికి కావాల్సిన ఎరువులను తెచ్చుకునేవారు. సిబ్బంది కూడా రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించేవారు. కియోస్క్ యంత్రాల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే అ తరువాత ఏ రైతుకు ఏ రకం కావాలన్న వెంటనే పంపిణీ చేసే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చారే తప్పా రైతులకు అందించాల్సిన సేవలు మాత్రం గాలికొదిలేశారు. దీంతో కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మార్చేశారు. ప్రస్తుతం ఆయా రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ సేవలు లేనందున కియోస్క్ యంత్రాలు మూలనపడ్డాయి.

అప్పట్లో ఎన్నో సేవలు

నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట, పెద్దాపురం మండలాల్లో ఆయా గ్రామాల్లోనూ ఒక్కో ఆర్‌బీకే ఏర్పాటు చేసి 44 కియోస్క్ యంత్రాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఆయా కియోస్క్ యంత్రాల ద్వారా మెరుగైన సేవలందించారు. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలందించేందుకు లక్షల రూపాయలు వెచ్చించి వీటిని కొనుగోలు చేశారు. ఈ యంత్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, వ్యవసాయ యంత్రాలు, రైతులు పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కెట్ వివరాలను ఈ డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకునే వీలుండేది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో రైతులకు వ్యవసాయ శాఖ అన్ని విధాల సేవలందించింది. వాతావరణంలో మార్పులు, ఏ సమయంలో ఏ పంటలు వేయాలనే సమాచారాన్ని దీన్నిలో పొందుపర్చారు. నాడు ఎంతోమంది రైతులకు మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు ప్రస్తుతం మాలకు చేరడంతో ప్రభుత్వ వైఫల్యం కట్టొచ్చినట్టు తెలుస్తోంది.

మొక్కుబడి సేవలు

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో లక్షలు విలువ చేసే కియోస్క్ యంత్రాల వినియోగంపై నిర్లక్ష్యం వహించడంతో ప్రజాధనం వృథా అవడంతో పాటు రైతులకు సరైన సమయంలో సాయం అందడంలేదు. దీనివల్ల రైతులు ఎరువుల కోసం ప్రైవేట్ డీటర్లను సంప్రదించాల్సి వస్తోంది. అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు మెరుగైన సేవలందించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

డిజిటల్ సేవలు అవసరం



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల్లో కియోస్క్ యంత్రాల ద్వారా అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించేవారు. రైతులకు అవసరమైన అన్ని సేవలు డిజిటల్ ద్వారా తెలియజేసేవారు. ఇప్పుడు కూడా రైతులకు డిజిటల్ సేవలు అవసరమే. అధికారులు వాటిని అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుంది.

– నాగబోయిన రాజుబాబు, పవర, సామర్లకోట మండలం

అధిక ధరలకు కొంటున్నాం



ఈ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందించలేకపోయింది. మా మండలంలో ఏ ఆర్‌బీకేల్లోనూ కియోస్క్ యంత్రాలను వాడడం లేదు. యూరియా ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొంటున్నాం. గత ప్రభుత్వం మాదిరిగా రైతులకు అవసరమైన అన్ని సేవలందించేలా పూర్తి చర్యలు చేపట్టాలి.

– సుందరెడ్డి రాజు, కౌలు రైతు, పులిమేరు, పెద్దాపురం మండలం

సమస్యలు పరిష్కరిస్తాం



రైతు సేవా కేంద్రంలో కియోస్క్ యంత్రాలు వినియోగంలోనే ఉన్నాయి. కొన్నిచోట్లు సాంకేతిక లోపంతో నిలిచిపోయాయి. అవి సత్వరమే పని చేసేలా చర్యలు తీసుకుంటాం. విత్తన కాలం అయిన తరువాత వాటి వినియోగం తక్కువగా ఉంటుంది. రైతుల సౌలభ్యం కోసం మొబైల్ యాప్ ద్వారా ఎక్కువ సేవలందిస్తున్నాం. సమస్య ఉంటే గుర్తించి పరిష్కరిస్తాం.

– కె.సంజయ్‌కుమార్, వ్యవసాయ శాఖాధికారి, పెద్దాపురం

అప్పీలు లేని అంతిమ తీర్పు లోక్ అదాలత్‌తో సాధ్యం

12వ అదనపు జిల్లా జడ్జి శ్రీహరి



జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

పిఠాపురం: అప్పీల్ లేని అంతిమ తీర్పు లోక్ అదాలత్‌తో సాధ్యమవుతుందని పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా స్థానిక కోర్టు హాల్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగాజడ్జి శ్రీహరి మాట్లాడుతూ కక్ష దారులు ఒకరికొకరు అవగాహన చేసుకుని రాజీమార్గం ద్వారా అప్పీల్లేని అంతిమ తీర్పును ఈ లోకదాలత్ ద్వారా పొందవచ్చన్నారు. కోర్టుకు వచ్చిన కక్ష్య దారులతో ఆయన మాట్లాడుతూ కోర్టులో పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడం ద్వారా కాలం, డబ్బు ఆదా అవుతుందని, మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 122 కేసులు పరిష్కారమయ్యాయి. తద్వారా రూ.1.38 కోట్ల ఆర్థిక లావాదేవీలయ్యారన్నారు. వాటిలో ఎం బీటీపీ 12, సివిల్ 23, క్రిమినల్ 25, ఎంవి యాక్ట్ 3, ఎక్సైజ్ 5, ఎస్టీసీ ఒకటి, బ్యాంక్ పీఎల్‌సీ ఒకటి, అడ్మిన్స్ 52 కేసులు పరిష్కారమయ్యాయి. బెంచ్‌లో జిల్లా జడ్జి శ్రీహరితోపాటు సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, జూనియర్ అదనపు సివిల్ జడ్జి ఎం.వి జయరామేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగా రాజారావు, జిల్లా కోర్టుల ఏపీపీ బత్తిన లక్ష్మణ దొర, న్యాయవాదులు ఎస్ఎం అలీ, ఐపి పాష, ఎం.సత్యవాణి డి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి అవకాశం ఇవ్వాలంటూ ధర్నా



బ్రహ్మానందపురంలో ఆందోళన నిర్వహించిన ఉండూరుకు చెందిన ఇళ్ల పట్టాల లబ్ధిదారులు

సామర్లకోట: అచ్చంపేట శివారు ప్రాంతమైన బ్రహ్మానందపురంలో ఇళ్ల స్థలాలకు పట్టాలు పొందిన లబ్ధిదారులు, ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వంలో ఉండూరు, అచ్చంపేట, పనసపాడు, గొంచాల, పి.వేమవరం గ్రామాలకు చెందిన సుమారు రెండు వేల మందికి ఇళ్ల స్థలాలను లేఅవుట్ చేసి పట్టాలను అందజేశారు. ఆ స్థలాల్లో గృహ నిర్మాణం ప్రారంభించడానికి తాగునీరు, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసిన తరువాత ఇళ్ల నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటి వరకు మా స్థలాలను స్వాధీనం చేయలేదని ఉండూరు గ్రామానికి చెందిన లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. 20 నుంచి 30 ఏళ్ల నుంచి ఉండూరు గ్రామంలో అద్దె ఇళ్లలో ఉండగా జగనన్న ప్రభుత్వంలో మొదటిసారిగా ఇళ్ల స్థలాలు ఇచ్చారని లబ్ధిదారులు తెలిపారు. అయితే నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత ఇళ్ల నిర్మాణం చేస్తారని, స్థానిక గ్రామ నాయకులు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జిల్లా కలెక్టరు వద్దకు వెళ్లినా ప్రయోజనం కనిపించలేదని లబ్ధిదారులు వాపోయారు. అద్దె ఇళ్లలో ఉంటున్న తమకు సొంత ఇంటి కల నెరవేరదని వారు వాపోయారు. తమకు ఇచ్చిన సెంటున్నర స్థలాన్ని స్వాధీనం చేసుకొని మూడు సెంట్లు స్థలం ఇస్తామని ఎమ్మెల్యే చెప్పుతున్నారన్నారు. సెంటున్నర స్థలంతోనే తృప్తి చెందుతామని దానిలోనే పాక వేసుకొనే అవకాశం కల్పించాలని, తాగునీరు, విద్యుత్ తమకు అవసరం లేదని లబ్ధిదారులు తెలిపారు. మరి వారి సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియడంలేదు. అదే విధంగా పట్టణ పరిధిలోని సుమారు ఏడు వార్డులకు చెందిన వారికి వేట్లపాలెం సమీపంలో ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో అప్పట్లో కూటమి నాయకులు ఆ స్థలాలు తీసుకోకుండా చేశారని స్థానిక లబ్ధిదారులు వాపోతున్నారు.

చేబ్రోలు సొసైటీలో డీసీఓ విచారణ



టోకెన్ల పంపిణీపై విచారణ నిర్వహిస్తున్న అధికారులు. చిత్రంలో జెడ్పీటీసీ వులవకాయల లోవరాజు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి వచ్చిన యూరియాను తీసుకునేందుకు రైతులు శనివారం తెల్లవారు జామునే వచ్చారు. సొసైటీ సిబ్బందికి రైతులు ఆధార్ కార్డులు ఇస్తుండగా కొంతమంది వాటిని విసిరి కొట్టడంతో చెల్లచెదురుగా పడిపోయాయి. ఇంతలో ఓ టీడీపీ నాయకుడు పిఠాపురం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చేతిలో ఉన్న టోకెన్లను లాక్కొని తనకు చెందిన రైతులకు అందజేశాడు. దీనిపై మిగిలిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. దీనిపై డీసీసీబీ డీసీఓ శ్రీనివాసరెడ్డి విచారణ చేపట్టారు. రైతుల ఆందోళన, వైఎస్సార్ సీపీ నాయకుల ధర్నా మేరకు సమాచారం అందుకున్న ఆయన సొసైటీకు చేరుకుని వివరాలు సేకరించారు. పిఠాపురం ఏడీఏ స్వాతి, మండల వ్యవసాయ శాఖాధికారి సత్యనారాయణ, సొసైటీ కార్యదర్శి ఈశ్వరరావు నుంచి వివరాలు సేకరించారు. తమ వద్ద నుంచి టీడీపీకు చెందిన ఒక నాయకుడు యూరియా టోకెన్లు లాక్కొని రైతులకు పంచిపెట్టాడని ఏడీఏ తెలిపారు. తాము ఇవ్వొద్దు అని చెప్పినా వినిపించుకోలేదన్నారు. చేసేది లేక మేము బయటకు వెళ్లిపోయామని ఏడీఏ తెలిపారు. సొసైటీ సిబ్బంది ఇష్టానుసారంగా టోకెన్లు జారీ చేశారని తెలిపారు. దీనికి సంబంధించిన ఫొటోలను డీసీఓకు ఆమె చూపించారు. దీనిపై వెంటనే సొసైటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు డీసీఓను కోరారు. సొసైటీ కార్యదర్శి, సిబ్బంది లేకుండా టోకెన్ ఎలా జారీ చేశారని ప్రశ్నించారు. యూరియాను బ్లాక్ మార్కెట్ తరలించేందుకు ఇదొక పన్నాగమని తెలిపారు. తక్షణం బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై స్పందించిన డీసీఓ శ్రీనివాసరెడ్డి బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు అందరికీ యూరియా ఇచ్చేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ పెర్సన్ ఇన్‌చార్జి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరికి ఎండు తెగులు బెడద



ఎండు తెగులుతో పాడైన వరిపొలం

సామర్లకోట: రైతుల వరి పంటకు యూరియా లభించక ఇబ్బంది పడుతూ ఉంటే గోరు చుట్టుపై రోకలి పోటు అన్న చందనా వరి పంటకు ఎండు తెగులు ఆశించిందని రైతులు వాపోతున్నారు. రైతుల ఫిర్యాదుల మేరకు మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్ శనవారం మండల పరిధిలోని రైతుల పంట భూములను పరిశీలించారు. ఎండు తెగులు బాక్టీరియా వలన వస్తుందని ఏఓ తెలిపారు. ఆకు అంచుల నుంచి పసుపు రంగునీటి డాగు మచ్చలుగా ఏర్పడి ఆకులపై నుంచి కిందికి ఎండిపోతాయని తెలిపారు. గాలిలో తేమ ఎక్కువగా ఉన్న సమయంలోను, ఎక్కువగా వర్షం వచ్చిన సమయంలోను ఈ తెగులు వృద్ధి చెందుతుందన్నారు. నీటి ముంపు ప్రాంతాల్లోను, చెట్ల నీడ ప్రాంతాల్లోనూ ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ తెగులు తగ్గే వరకూ నత్రజని వేయడం ఆపాలని సూచించారు. ఎండు తెగులు నివారణకు కాపర్ హైడ్రోక్సిడ్ రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. వరి పంటలో పొటాష్ లోపం కనిపిస్తుందని తెలిపారు. మొక్కలు ఎదుగుదల తగ్గిపోవడం, పైర్లు వేయడం తగ్గడం వంటి లక్షణాలు మండలంలోని వరి పొలాల్లో ఉందని దీనిని నివారించుకోవడానికి రైతులు పొటాష్ ఏడు రోజులకు ఒకసారి రెండు పర్యాయాలు పిచికారీ చేయాలన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న రాజేశ్వరి

కొత్తపల్లి: అమీనాబాదు గ్రామానికి చెందిన ముగు అప్పలరాజు ఇటీవల మృతి చెందాడు. శనివారం ఆ గ్రామానికి చెందిన మడదా రాజేశ్వరి తన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆర్థిక సహాయం, నిత్యావసర సరకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలోనే మానవత్వం ఉంటుందన్నారు. ఇబ్బందుల్లో ఉన్నవారిని ప్రతి ఒక్కరూ తమకు అవకాశం ఉన్నంతలో సహాయపడాలన్నారు.

ఉప్పాడ తీరప్రాంతం పరిశీలన



ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనీషా

కొత్తపల్లి: ఉప్పాడ తీరప్రాంతం, కోతకు గురవుతున్న బీచ్‌రోడ్డును శనివారం అధికారులతో కలిసి ట్రైనీ కలెక్టర్ మనీషా పరిశీలించారు. మత్స్యకారులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మనీషా మాట్లాడుతూ సముద్ర అలల ఉధృతి కారణంగా కెరటాలు రోడ్డును దాటి తీర ప్రాంత గ్రామాలైన సుబ్బంపేట, రంగంపేట, కొత్తపట్నంలోకి వస్తున్నాయి. గత మూడు రోజుల నుంచి నీరు నిలిచిపోవడంతో ఆ నీటిని మోటార్లతో తోడిస్తున్నారు. తీరప్రాంత శాశ్వత రక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. బీచ్‌రోడ్డు ప్రమాదకరంగా ఉందని రోడ్డుపై రాకపోకలు నిలిపివేయాలని అధికారులకు కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారాన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మల్లిబాబు, తహసీల్దారు చిన్నారావు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

సామర్లకోట: గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగింపును పురస్కరించుకొని స్థానిక బ్రౌన్‌పేట శివారు గణేష్ కాలనీలో శనివారం భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మానవహక్కుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బలుసు వాసు, మాజీ కౌన్సిలర్లు అడబాల కుమారస్వామి, బగుగు శ్రీకాంత్, అందుగుల జార్జీచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. సుమారు మూడు వేల మందికి అన్నదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

కొత్తపల్లి: స్థానిక పోస్ట్ ఆఫీస్ వీధిలో రామాలయం వద్ద రామ్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో శనివారం భారీ అన్నసమారాధన జరిగింది. భక్తుల కానుకలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 3 వేలు మంది భక్తులు తరలివచ్చి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



గణేష్ కాలనీలో అన్నదానం

అండర్–19 ఎస్‌జీఎఫ్ఐ షెడ్యూల్లో మార్పులు

22న జరగాల్సిన ఎంపికలు 19కి మార్పు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటి): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–19 ఆధ్వర్యంలో ఈ నెల 22న జరగాల్సిన వివిధ క్రీడా ఎంపికలు ఈ నెల 19కి మార్పు చేసినట్టు క్రీడాసమాఖ్య కార్యదర్శి వెంకటరెడ్డి శనివారం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల తేదీలు ప్రకటించడంతో ఈ మార్పు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. 19న డీఎస్‌ఏ కాకినాడలో సైక్లింగ్, మోడ్రన్‌పెంటాథలాన్, ఎన్టీఆర్ బీచ్ కాకినాడలో బీచ్ వాలీబాల్, రాజాట్యాంక్‌లో స్కేటింగ్, కోనసీమ రాజోలులో ఫెన్సింగ్, జి.మామిడాడ ఫ్యామిలీ క్లబ్‌లో టేబుల్‌టెన్నిస్, పిఠాపురంలో ఆర్చరీ ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ ఎంపికలు సీనియర్ పీడీలు రత్న శామ్యూల్, శివరామకృష్ణ పర్యవేక్షణలో నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు సంబంధిత ఎంపిక పత్రాలతో హాజరుకావాలని వెంకటరెడ్డి కోరారు.

అండర్–17 గట్కా జట్టు ఇదే



గట్కా విభాగంలో ఎంపికైన క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటి): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో ఈ నెల 11న కాకినాడ డీఎస్‌ఏలో నిర్వహించిన గట్కా పోటీల్లో ఎంపికైన క్రీడాకారుల వివరాలు శనివారం సమాఖ్య కార్యదర్శి కె.శ్రీనివాసరావు వెల్లడించారు. బాలుర విభాగంలో యూపీవీఎస్ శ్రీకృష్ణ, పీవీ మధు, బీ హర్షసాయి, వి.చంద్రశేఖర్, ఏ రిషికుమార్, సీహెచ్ డీ మహిధర్, జి.ఆరోన్‌కుమార్, కె.లికిష్, కె.వర్షిత్, ఎస్ఎన్ సాయి నికేష్ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను సమాఖ్య బాలికల కార్యదర్శి సుధారాణి, సీనియర్ పీడీలు రవిరాజు, బచ్చు చంద్రశేఖర్, మాచరరావు, పట్టాభి అభినందించారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు



విద్యార్థులకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

బోట్‌క్లబ్: గుండెపోటు వచ్చిన మనిషికి సీపీఆర్ చేస్తే అతని ప్రాణం కాపాడవచ్చని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల్లో శనివారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒక వ్యక్తి శ్వాస తీసుకోవడం, హృదయ స్పందన ఆగిపోయినప్పుడు చేసే అత్యవసర చికిత్సను సీపీఆర్ అంటారన్నారు. నిమిషానికి 100 నుంచి 120 సార్లు ఛాతీ మధ్యలో గట్టిగా, వేగంగా నొక్కుతూ వైద్య సహాయం వచ్చే వరకు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, కళాశాల డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు పాల్గొన్నారు.

నేడు జూనియర్ అథ్లెటిక్స్ మీట్ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటి): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఆదివారం క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్టు సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. అండర్–14, 16,18 అండర్–20 విభాగాల్లో బాల బాలికల ఎంపికలు ఏపీఎస్పీ పోలీస్ గ్రౌండ్స్ క్రీడా మైదానంలో జరుగుతాయన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. ఎంపికలు సంఘ అధ్యక్షుడు టీవీఎస్ రంగారావు, ట్రెజరర్ వర్మ పర్యవేక్షణలో జరుగతాయన్నారు.